విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమ గోదావరి

30,31 తేదీల్లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభ

విశాలాంధ్ర-చింతలపూడి: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ ఈనెల 30, 31 తేదీల్లో ఏలూరులో జరుగుతుందని, ఈ మహాసభను జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ చింతలపూడి గౌరవాధ్యక్షుడు తోర్లపాటి బాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ పట్టణ కార్యాలయంలో చింతలపూడి మున్సిపల్ వర్కర్స్ సమావేశం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 123 కార్పొరేషన్ మున్సిపాలిటీ నగర పంచాయతీలలో 52వేల మందికి పైగా పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని ప్రజారోగ్యంలో వీరి పాత్ర కీలకమైనదని బాబు అన్నారు. జగన్ ప్రతిపక్షగా నాయకునిగా ఉన్నప్పుడు తాను అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరిస్తానని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ హామీని మరిచారని విమర్శించారు. తక్షణం మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని కోరారు. యూనిఫాం, సబ్బులు, చెప్పులు, కొబ్బరి నూనె తక్షణమే అందజేయాలన్నారు. వీటితోపాటు స్థానిక మున్సిపాలిటీలో ఉన్న సమస్యలను గుర్తించి ఈ మహాసభలో కార్యాచరణ రూపొందించి సమస్యల సాధన కొరకు పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తామని ఆయన తెలిపారు. మున్సిపల్ కార్మికులంతా ఈ మహాసభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్మికులు వెలగాడి అనురాధ, సందీపం చిన్నన్న, బి నారాయణ, బి రాజేష్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: ఏలూరు, జంగారెడ్డిగూడెం పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉంటున్న రౌడీ షీటర్లకు పోలీసులు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతికి భంగం కలిగించే లాగా ఎవరైనా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీట్ ఓపెన్ చేస్తే మంచి పరివర్తనతో ఉంటే వారిపై రౌడీ షీట్లు తొలగించేందుకు ఉన్నతాధి కారులకు సిఫార్సు చేస్తామన్నారు. రౌడీ షీటర్ల జీవనోపాధి కొరకు వారు ఏ ఏ వృత్తులు నిర్వహిస్తున్నారు అనే విషయాలపై పోలీస్ అధికారులు రౌడీ షీటర్‌లను అడిగి తెలుసుకున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: సీసీ రహదారి నిర్మాణానికి కృషి చేస్తామని పరింపూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయకుమారి పేర్కొన్నారు. కొయ్యలగూడెం పట్టణంలో మత్స్యకారుల ఏరియా నుండి రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు నూతనంగా ఇచ్చిన జగనన్న ఇళ్లకు వెళ్లే రహదారి పూర్తిగా అధ్వానంగా తయారవడంతో రహదారిపై ప్రయాణించాలంటే అనేక ఇబ్బందులు పడవలసి వస్తుందని, చినుకు పడితే చాలు బురద మాయంగా తయారై రహదారిపై నడిచి వెళ్లాలన్న ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని నడవవలసి వస్తుందని రహదారిపై నడిచే ప్రజలు జారిపోయి పడిపోతున్నారని రహదారి నిర్మాణం చేపట్టాలని సర్పంచ్ ముప్పిడి విజయ కుమారికి ఆ ప్రాంత ప్రజలు తెలియజేయగా, ఆమె సానుకూలంగా స్పందిస్తూ ఈ సమస్యను పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు తెలియజేస్తానని శాసనసభ్యుల ద్వారా సిసి రహదారి ఏర్పాటుకు కృషి చేస్తామని సర్పంచ్ విజయ కుమారి మత్స్యకారుల ప్రాంత ప్రజలకు తెలిపారు.

ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత ధ్యేయం

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత ధ్యేయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉంగుటూరు మండల మానవత సమావేశం యర్రమిల్లిపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి మానవత మండల అధ్యక్షుడు గంజి రవికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మానవత స్వచ్ఛంద సంస్థ రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి మాట్లాడుతూ మానవత సంస్థలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. మానవత సేవలు జిల్లా అంతా విస్తృతం చేస్తున్నామన్నారు. యర్రమిల్లిపాడు గ్రామ సర్పంచ్ తమ్మిన శ్రీనివాసరావు మాట్లాడుతూ మన గ్రామం చుట్టుపక్కల గ్రామాలకు ఉపయోగపడే విధంగా ఫ్రీజర్ ను బహుకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మానవత సీనియర్ నాయకులు శీతల సత్యనారాయణ, ఉంగుటూరు మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు పుత్సకాయల విష్ణుమూర్తి, కోనే సత్యనారాయణ కండెపు రవి, పోనుకుమాటి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

డోర్-టు-డోర్ సర్వేపై సమీక్ష

విశాలాంధ్ర-పెదపాడు: మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం పెదపాడు గ్రామంలో డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ, డిప్యూటీ కలెక్టర్, ఈఆర్‌ఓ 64 దెందులూరు నియోజక వర్గం సూపర్‌వైజర్లు, బీఎల్వోలతో డోర్ టు డోర్ సర్వే పై సమీక్ష నిర్వహించారు. మరణించిన వారి ఓట్లు ఫామ్-7 లను పెట్టి తొలగించిన వాటిని పరిశీలించారు. ప్రతి బీఎల్వో తొలగించిన ఓట్ల బీఎల్వో వారీగా అడిగి వారు తీసుకున్న ఫార్మ్-6, ఫార్మ్-7, ఫార్మ్-8 అప్లికేషన్స్‌ను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో వీరమ్మ కుంట గ్రామంలో పర్యటించి మరణించిన వారి ఓట్లను, పి ఎస్ నం. 112లో గ్రామంలో వారి ఇంటి వద్దకు వెళ్ళి వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. పీఎస్ నం. 112, బీఎల్వో కె .మనికాంత్, గ్రామ రెవెన్యూ అధికారులు ఎ.నరసింహ, బి కోటేశ్వరరావు, తహసీల్దార్ జి. విజయ కుమార్ రాజుతో కలిసి పరిశీలించారు. ఎంపిడిఓ ఎన్. నిర్మల జ్యోతి, డిప్యూటీ తహశీల్దార్ ఎస్ వి డి వి ప్రసాద్ బాబు , ఆదినారాయణ ఎ ఎస్ ఒ , గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

కైకరంలో పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-ఉంగుటూరు: ప్రసిద్ధకవి జటావల్లభుల సూర్య నారాయణ శాస్త్రి రచించిన సంపూర్ణ భద్రాద్రి మహాత్మ్యం, రామతత్త్వం పుస్తకావిష్కరణ ఆదివారం కైకరంలో నిర్వహించారు. రాజమండ్రికి చెందిన మహా పండితులు డాక్టర్ ధూళిపాళ మహాదేవి మణి అధ్యక్షత వహిస్తూ పంచమ ముద్రణకు నోచుకున్న భద్రాద్రి మహాత్మ్యం, రామతత్త్వం కాల పరీక్షకు నిలిచిన మహత్ కావ్యమన్నారు. జటావల్లభుల జగన్నాథం తన తండ్రి రాసిన కావ్యం సర్వజన దిగ్దర్శిని అన్నారు. ముఖ్య అతిథి గిడుగు వేంకటాచలపతిరావు గ్రంథ సమీక్ష సోదాహరణపూర్వకంగా వివరించారు. ఇనుగంటి ఉమారామారావు, సుబ్రమణ్య దీక్షితులు, ముత్యరమేష్, రాంపల్లి సూర్య భగవాన్లు, సుబ్రహ్మణ్యం, కొచ్చర్లకోట శ్రీనివాస్, కూన అప్పారావు, రామమూర్తి, మాధవ విద్యారణ్య స్వామి, డాక్టర్ సాయిరామ్ పాల్గొన్నారు.

మా మద్దతు జనసేనకే

విశాలాంధ్ర-ఉంగుటూరు: గణపవరం మండలం వరద రాజపురం గ్రామస్తులు, జనసైనికులు ఆదివారం పెద్దసంఖ్యలో తరలి వచ్చి ఉంగుటూరు నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ పత్సమట్ల ధర్మరాజును ఉంగుటూరు పార్టీ కార్యాలయంలో కలుసుకున్నారు. జనసేన పార్టీకి మద్దతు తెలిపారు. ధర్మరాజు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ విజయం సాధించేందుకు అందరూ ఐక్యమత్యంతో పని చేయాలన్నారు. తోట శ్రీను, తానేటి జోగేశ్వరావు, అయ్యప్ప, ఎన్ దుర్గరావు, పీవీ సుబ్బారావు, ఎన్ బాలాజీ, సామన సత్యనారాయణ, సోమ వీర రాఘవులు, సామన నాగేశ్వరావు, బురయ్య, జగపతి పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న గోపీ

విశాలాంధ్ర-పాలకొల్లు: ఏకాదశి పర్వదినం సందర్భంగా పాలకొల్లు వైసీపీ ఇంఛార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) యలమంచిలి మండలం, కొంతేరులోని శ్రీ కుంతీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. అభిషేక కార్యక్రమంలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్, దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ మల్లుల రవికుమార్ గుడాల గోపి కి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు మరువలేనివి: వంకా

విశాలాంధ్ర-ఏలూరు: ఎందరో జీవితాల్లో స్థిరపడడానికి లయన్స్ క్లబ్స్ చేసే సేవాకార్యక్రమాలు ఉపయోగపడుతున్నాయని, ఈ కార్యక్రమాల్ని ప్రోత్సహించేవారు అభినందనీయులని ఎమ్మెల్సీ, ఏపీ లయన్స్ క్లబ్స్ మల్టిపుల్ సంఘాల చైర్మన్ వంక రవీంద్రనాథ్ అన్నారు. పెదవేగి ఎస్ఎస్‌వీఎస్ స్కూల్ ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి సేవ మహోత్సవంలో రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ ప్రాంత లయన్స్ నాయకులూ ఎక్కువగా మహిళల స్వయం శక్తి పై నిలబడేలా టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి, వారికి కొత్త సూయింగ్ మెషిన్‌లు కూడా ఏర్పాటు చేయడం చాలామంచి కార్యక్రమమన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు సైకిళ్లను, మహిళలకు పిండియంత్రాలు, డస్ట్ బిన్స్ ఇవ్వడం కూడా పర్యావరణానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. ఈ సేవ మహోత్సవాన్ని ఏర్పాటు చేసిన జిల్లా సేవ కోఆర్డినేటర్ అవినాష్ రాజును, 'నా మొక్క-నా శ్వాస' కార్యక్రమంలో మొక్కల్ని పంపిణీ చేసిన జిల్లా లయన్స్ గవర్నర్ గట్టి మాణిక్యాలరావును అభినందించారు. కృష్ణంరాజు, సేవ కోఆర్డినేటర్ జీ మోసెస్, కే పద్మావతి, ఏరియా లీడర్ కే కృష్ణకుమారి, లయన్స్ నాయకులు ఎక్కిన వెంకటేశ్వరరావు, అవన్‌రావు, కాట్రు విజయ్, శేషకుమార్, కొమ్ముల మురళి పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తక్షణమే తగ్గించాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కేతవరంలో సీపీఐ కేతవరం గ్రామకమిటీ సమావేశం అంకా లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిత్యావసర సరుకులు, గ్యాస్ ,పెట్రోల్, డీజిల్ ధరలు ప్రభుత్వాలు విపరీతంగా పెంచుతున్నాయని వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు . ప్రధాని మోడీ గెలిచిన 9 ఏళ్ల నుండి దేశంలో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు ధారపోస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు పేరుతో గ్రామాలలో అభివృద్ధి లేకుండా చేస్తున్నారని అన్నారు. జగనన్న గృహ నిర్మాణాలు చేసే లేఔట్ కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు,పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లలో ప్రభుత్వమే పేదలకు ఇళ్ళు నిర్మించి ఇవ్వాలన్నారు.ప్రజలను నిత్యం మోసం చేసే మోదీ, జగన్ ప్రభుత్వాలను వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని సూచించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొలిమే బాలఏసు, మంచాల ప్రభాకర్, కొసం అబ్బులు పాల్గొన్నారు.

రోడ్డు బాగుచేయాలంటూ నిరసన

విశాలాంధ్ర-ముదినేపల్లి: ముదినేపల్లి-సింగరాయపాలెం వెళ్లే ఆర్ అండ్ బి ప్రధాన రహదారి వడాలి సెంటర్లో పెద్ద గుంతలు, మార్జిన్ల కోత, గ్రావెల్ లేచి టైర్ల కింద స్లిప్ అయ్యి ప్రజలు గాయాల పాలవుతున్నారని వెంటనే మరమ్మత్తులు చేపట్టాలంటూ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ ఆధ్వర్యంలో రహదారిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలుపుదల చేశారు. ప్రభుత్వం రోడ్ల నిర్మాణం, మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వర్షాలతో ప్రజలు , వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. సత్యవోలు నాగలక్ష్మి, భుజంగం, పాండు, రమేష్, పాపారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

టీటీడీలో శేషుబాబుకు స్థానం అభినందనీయం

విశాలాంధ్ర-ఉండి: టీటీడీ పాలక మండలి సభ్యులుగా మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబుకు స్థానం దక్కడం అభినందనీయమని వైసీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ మునుకోలు సింహాచలం అన్నారు. టీటీడీ బోర్డు సభ్యులుగా ఎన్నికైన మేక శేషుబాబు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన మునుకోలు సింహాచలం, బడుగు బాలాజీ, వీరమల్లు మల్లేశ్వరరావు, అంగర సునీల్, చేబ్రోలు బాలాజీ, కన్నా, కాగిత బాలాజీ, చిట్టిబొమ్మల సతీష్ మోహన్, బొల్లా అబ్బులు శేషు బాబుకు పుష్పగుచ్ఛం అందించి స్వీట్స్ తినిపించి అభినందనలు తెలిపారు. దొండా వెంకటేష్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

విశాలాంధ్ర-పాలకొల్లు: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ పాలకొల్లు శాఖ ఆధ్వర్యంలో గుండె సంబంధిత వ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక లైన్స్ క్లబ్ ఆసుపత్రి ప్రాంగణంలో ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ప్రపంచ ప్రఖ్యాత గుండె, ఊపిరితిత్తుల వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని తొలుత రాజవల్లి రాధా రమణ్ లైన్స్ కంటి ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ ఎన్. పాపారావు నాయుడు ప్రారంభించారు. డా॥ పీవీ సురేష్ కుమార్, డా॥ ఎం. మాధవ రావు, డా॥ పైడి అనిరుధ్ కుమార్, డా॥ ఎన్. వెంకటరెడ్డి రోగులను పరీక్షించి తగిన వైద్య సేవలు అందించారు.

లోకేష్ పాదయాత్రకు ఘన స్వాగతం

విశాలాంధ్ర-లింగపాలెం: నారా లోకేష్ పాదయాత్ర చింతలపూడి నియోజకవర్గ సరిహద్దులోని వలసపల్లి చెక్‌పోస్టు వద్దకు చేరుకోగానే నియోజకవర్గ, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు స్వాగతం పలికేందుకు ఉత్సాహం చూపారు. జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎంపీ మాగంటి బాబు, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యేలు ఘంటా మురళీ, చింతమనేని ప్రభాకర్, మాజీ జడ్పీటిసి పెదబాబు, మాజీ ఎంపీపీ మోరంపూడి మల్లికార్జునరావు, టీడీపీ బీసీ నాయకులు చెరువుగట్టు రామ్మోహన్, పిల్లల శ్రీనివాస్‌యాదవ, టీడీపీ ఎస్సీ నాయకులు మారుమూడి థామస్, మండల పార్టీ అధ్యక్షులు గరిమెళ్ళ చలపతి, తెలుగుదేశం సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, ఆశావహులు, పార్టీ కార్యకర్తలు లోకేష్‌కి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. ధర్మాజీగూడెంలో క్రేన్‌లతో గజమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ధర్మాజీగూడెం, మతంగూడెంలో లోకేష్ స్థానికులతో మాట్లాడి సమస్యలు తీసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాబోతుందని, ఇకపై ప్రజలకు కష్టాలు ఉండవని లోకేష్ భరోసా ఇచ్చారు.

ఫ్లెక్సీలతో స్వాగతం: నారా లోకేష్ యువగళం పాదయాత్రను పురస్కరించుకుని చింతలపూడిలోని వలసపల్లి చెక్‌పోస్టు నుంచి ఆయన బస చేసే సుందరరాజుపేట వరకు పసుపుమయమైంది. పాదయాత్ర ప్రారంభమైన చింతలపూడి నియోజకవర్గంలో మొదటి రోజు దాదాపు 12 కిలోమీటర్ల మేర యాత్ర సాగింది. ధర్మాజీగూడెం, మతంగూడెంల మీదుగా సుందరరాజుపేట దాటి లింగపాలెం సరిహద్దు వరకు ఈ యాత్ర కొనసాగింది. ఈ మార్గమంతా రోడ్డుకు రెండువైపుల స్వాగత ఫ్లెక్సీలను, పసుపు జెండాలను కట్టారు. లోకేష్‌కి స్వాగతం పలుకుతూ పెట్టిన హోర్డింగ్‌లు, భారీ కటౌట్‌లు ఆకర్షణగా నిలిచాయి. లింగపాలెం మండలంలో సాగిన ఈ పాదయాత్రలో పాల్గొనేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. లోకేష్ అడుగులో అడుగు వేసుకుంటూ వేల మంది పాదయాత్రలో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని నాయకులంతా కలసికట్టుగా యువగళం పాదయాత్ర విజయవంతానికి సహకరించారు. జిందాబాద్ తెలుగుదేశం, నారా లోకేష్ నాయకత్వం వర్ధిల్లాలంటూ చేసిన నినాదాలు హోరెత్తాయి. పాదయాత్ర జరిగే మార్గంలో భారీగా బాణాసంచా కాల్చారు. తీన్‌మార్ వాయిద్యాలు, అభిమానుల డ్యాన్సుల మధ్య పాదయాత్ర ఉల్లాసంగా సాగింది.

ఏలూరు: జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాదయాత్ర 196వ రోజు ముసునూరు మండలం వలసపల్లి జనసంద్రంగా మారింది. ఆదివారం నాలుగు గంటల నుంచి ప్రారంభమైన ఆయన పాదయాత్రలో ఇటు నూజివీడు, అటు చింతలపూడి దెందులూరు నియోజకవర్గాల నుంచి నాయకులు పార్టీలో ప్రముఖులు ప్రజలు తండోపతండాలుగా తరలిరావడంతో వలసపల్లి ప్రధాన రహదారులు ఇసుక వేస్తే రాలని విధంగా కిక్కిరిసిపోయాయి. వలసపల్లిలో గల నాగేంద్ర స్వామి దేవాలయం వద్ద, ప్రధాన సెంటర్లో లోకేష్‌ని గజమాలలతో సత్కరించారు. రెండు నియోజకవర్గాలకు మధ్యలో ఉన్న తమ్మిలేరు పైకి పాదయాత్ర చేరుకునేసరికి వంతెన కంపిస్తుందా అన్న చందంగా మారింది. ఈ ప్రాంతంలో యువగళం పాదయాత్రలో యువత ఎక్కువగా పాల్గొని జై లోకేష్ అంటూ నినాదాలు చేస్తూ తమ మద్దతు పెద్దఎత్తున తెలపడం శుభపరిణామమని ముద్రబోయిన ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. అంతేకాకుండా గ్రామ గ్రామాన మహిళలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని మీరు రావాలి మార్పు కావాలి అని కోరుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు.

అప్పులు ఫుల్... అభివృద్ధి నిల్

విశాలాంధ్ర-ఉండి: వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లల్లో అప్పులు ఫుల్ అభివృద్ధి నిల్‌గా మార్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశారని జనసేన ఉండి నియోజకవర్గ ఇన్చార్జ్ జుత్తికి నాగరాజు విమర్శించారు. ఉండి-గణపవరం రోడ్డులో ఆదివారం జనసేన పార్టీ మండల అధ్యక్షులు యాడవల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జనంలోకి జనసేన ఇంటింటికి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జనసేన ఉండి నియోజకవర్గ ఇన్చార్జ్ జుత్తిగ నాగరాజు హాజరయ్యారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి గవరలక్ష్మి , కాళ్ల మండల పార్టీ అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, గొట్టుముక్కల సుబ్బరాజు, పోలిశెట్టి బ్రహ్మానందం, కుచ్చు శివకృష్ణ, యర్ర రవి, అడప గణేష్, కర్రీ వెంకటరమణ, గేదెల నరసింహులు, పెదపాటి శివప్రసాద్, కురిటి వెంకట అప్పారావు, కురిటి రమేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: ఆరోగ్యం పట్ల ప్రజలు శ్రద్ధ వహించాలని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రంలో అందిస్తున్న వైద్యసేవలను వినియోగించుకోవాలని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు కోరారు. మెంటేవారి తోట సుందరయ్య భవనంలో ఆదివారం పక్షవాతం, ఫిట్స్, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వసుధ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ యం.వి.రామరాజు, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ బి.బలరాం, ట్రస్టీ బి.వాసుదేవరావు, జన విజ్ఞాన వేదిక కన్వీనర్ మల్లుల శ్రీనివాస్, అజయ్ కుమార్, సాహితీ స్రవంతి కన్వీనర్ చైతన్య ప్రసాద్, మెడికల్ రిప్రజెంటివ్స్ యూనియన్ నాయకులు యు. శ్రీనివాస్ కె.సూర్యచంద్ర రాజు, స్వచ్ఛంద సంస్థ మానవతాకు చెందిన బుద్ధరాజు వేంకటపతి రాజు, యం వైకుంఠరావు, జి రఫాయిల్ పాల్గొన్నారు

యువగళం విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు కోరారు. యువగళం పాదయాత్ర 29న పోలవరం నియోజవర్గం టి నరసాపురం మండలంలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో టి నరసాపురంలో టీడీపీ నాయకులు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 29న యువగళం పాదయాత్ర టి నరసాపురం పంచాయతీలోనికి ప్రవేశించి రాత్రి 8 గంటల వరకు టి నరసాపురం, గురవాయిగూడెం, ఏపిగుంట, శ్రీరామవరం, తిరుమలదేవిపేట, మధ్యాహ్నపువారి గూడెం, వెంకటాపురం, బొర్రంపాలెం, వల్లంపట్ల గ్రామపంచాయతీల మీదుగా సాగుతుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు రామకృష్ణారావుగౌడ్, రాష్ట్ర కార్యదర్శులు జే శ్రీరామ్మూర్తి, ఎస్ వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి సభ్యులు ఎన్వీ చలపతిరావు, పోలవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు జీ సురేంద్రనాథ్ చౌదరి, ఎ జగ్గారావు, కే మాధవరావు, జే సోంబాబు, ఎస్ ప్రభాకర్, ఓ శ్రీనివాస్, జే శేషారావు, ఆర్ వేములయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 3న బ్లాక్ డేగా పాటించాలి

విశాలాంధ్ర-భీమవరం: అక్టోబర్ 3ను బ్లాక్ డేగా పాటించాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపును జయప్రదం చేయాలని అఖిల భారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. ఢిల్లీలో 24న జరిగిన జాతీయ రైతు సంఘాల జెఎసి సదస్సులో పాల్గొని భీమవరం విచ్చేసిన ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. నిరసనల్లో భాగంగా నవంబర్ 26 నుంచి 28వ తేదీ వరకు గవర్నర్ కార్యాలయాల వద్ద వేలాది మందితో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు, డిసెంబర్ 20, 24 జనవరిలో మోదీ ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ మోదీ హటావో దేశ్ బచావో ఉద్యమం ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు.

తటాకంలా ఆర్ అండ్ బీ రోడ్డు

విశాలాంధ్ర- ముదినేపల్లి: ఎంతో పల్లపు ప్రాంతంగా ఉన్న ప్రధాన రహదారి కొద్ది పాటి వర్షానికి తటాకంలా మారుతోంది. నిత్యం వందలాది వాహనాలు రాక పోకలు సాగే ఈ రహదారి చెంతన ఐటీఐ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పలు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు వెళ్లే రోడ్డు జలమయంతో అతి ప్రమాదకరంగా మారింది. ముదినేపల్లి గురజ రోడ్డు దుస్థితి వర్ణనా తీతంగా ఉంది. పాఠశాల, కళాశాలల బస్సులు గుడ్లవల్లేరు వైపు వెళ్లే వంద లాది వాహనాలు వర్షపు నీటితో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్ అండ్ బి రహదారిపై ప్రయాణాలు వర్షాకాలంలో నరకప్రాయంగా మారింది. రహదారిలో ఎక్కడ గుంతలున్నాయి వర్షంలో తెలియక విద్యార్థులు సైకిళ్లు, బైకులతో కింద పడిపోవడం పరిపాటిగా మారిందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముదినేపల్లి గుడ్లవల్లేరు ఆర్ అండ్ బి రహదారి పొడవునా గురజ పొలిమేర వరకు రెండున్నర కిలోమీటర్లు ఈ పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆర్ అండ్ బి శాఖ స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా సరస్వతీ పూజ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: స్థానిక బుట్టాయగూడెం రోడ్‌లోని నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణమసోత్సవాల్లో భాగంగా సరస్వతీపూజ నిర్వహించారు. ఆలయ ముఖమండపంలో చిన్నారులచే ముందుగా గణపతిపూజ చేయించి సరస్వతీమాతను షోడశోపచారాలతో అర్చించి నీరాజన, మంత్రపుష్పాలు సమర్పించి పూజను ప్రధాన అర్చకులు మనోజ్ శర్మ ఘనంగా చేయించారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ(పండు) బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుండి శ్రావణపౌర్ణమి సందర్భంగా లోకకళ్యాణం కోసం 54వ చండీహోమం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రముఖులు, మహిళలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.